నమస్తే తెలంగాణ
వికారాబాద్
11 | హైదరాబాద్, గురువారం 29 ఫిబ్రవరి 2024 | VIKARABAD

చేవెళ్ల ప్రభుత్వ కాలేజీ వద్ద పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు

సజావుగా ఇంటర్ పరీక్షలు

- రంగారెడ్డి జిల్లాలో 195 సెంటర్లల్లో పరీక్షలు ప్రారంభం
- 772మంది విద్యార్థుల గైర్హాజరు

హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28 : రంగారెడ్డి జిల్లాలో 195 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగాయి. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 74,875మంది విద్యార్థులకుగాను, 772 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం జరిగే ద్వితీయ సంవత్సరం పరీక్షకు 74,191 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. సీసీటీవీల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్‌స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం కనిపించింది. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు హాజరు కానివ్వమని అధికారులు నిబంధన పెట్టడంతో విద్యార్థులంతా ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు.

772మంది గైర్హాజరు..

జిల్లావ్యాప్తంగా మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాలకు వివిధ కారణాల చేత 772మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నంలో ఐదు జనరల్ కేంద్రాలు, రెండు ఒకేషనల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంచాలలో యాచారం మండలంలోని గున్‌గల్‌లో ఒక్కొక్క పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.

వికారాబాద్ జిల్లాలో..

- 8,186 మంది విద్యార్థులకు 7,880 మంది హాజరు
- 5 నిమిషాలు ఆలస్యం.. వెనుదిరిగిన విద్యార్థులు

వికారాబాద్, ఫిబ్రవరి 28 : వికారాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగాయి. జిల్లాలో 29 పరీక్షా కేంద్రాల్లో 8,186 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉన్నది. 7,880 మంది విద్యార్థులు హాజరు కాగా, 306 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు గంట ముందుగానే చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జనరల్‌లో 6,788 మంది ఉండగా, 6,572 మంది విద్యార్థులు హాజరయ్యారు. 216 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషన్‌లో 1,398 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 1,308 మంది విద్యార్థులు రాశారు. 90 మంది గైర్హాజరయ్యారు. సిద్ధార్థ కళాశాల పరీక్షా కేంద్రానికి ముగ్గురు విద్యార్థులు 5 నిమిషాలు ఆలస్యంగా రావడంతో పోలీసులు వారిని లోపలికి పంపలేదు. పరీక్షా కేంద్రాలను వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. ఎవరు ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడలేదని అధికారులు తెలిపారు.

వికారాబాద్‌లో పరీక్షా కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

రంగారెడ్డి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : మధ్యాహ్న భోజన కార్మికుల 5 నెలల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. గుడ్డుకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని లేని పక్షంలో ప్రభుత్వమే గుడ్లను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన అల్పాహారం బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయల వేతనం ఇస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల నాటి హామీని నిలబెట్టుకోవాలన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ, ఎల్లేశ్, బుగ్గ రాములు, శేఖర్, బాల్ రాజ్, చందూనాయక్, శ్రీను. అలివేలు, సరిత, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

- ఏటా వేసవిలో ఉపాధి హామీ కూలీలకు అదనంగా కూలీ డబ్బులు చెల్లింపు
- ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మేలో 30 శాతం అదనపు కూలీ డబ్బులను పదేండ్లపాటు చెల్లించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ఉపాధి కూలీలకు.. చేయిచ్చారు..

వేసవి అదనపు కూలీని ప్రకటించని కాంగ్రెస్ ప్రభుత్వం

వికారాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : పేద కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. రెండేండ్లుగా లక్షల్లో పని దినాలను తగ్గిస్తూ పేదల కడుపు కొడుతూ ఉపాధి హామీ పథకంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వస్తున్నాయి. కేవలం రెండేండ్లలోనే జిల్లాలో ఉపాధి హామీ పని దినాల సంఖ్యను దాదాపు 50 లక్షలకు తగ్గించి ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా బంద్ చేసే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ముందుకెళ్తున్నది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ కూలీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఏటా వేసవిలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు అదనపు కూలీ డబ్బులను కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తూ వస్తున్నది. వేసవిలో భానుడి ప్రతాపంతో అధిక సమయం పని చేయలేదు. దీంతోపాటు మండే ఎండలోనూ ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న దృష్ట్యా అదనంగా కూలీ డబ్బులను గత పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చింది. ముఖ్యంగా ఏప్రిల్, మే మాసాల్లో ఎండలు విపరీతంగా ఉంటాయి కాబట్టి ఈ రెండు మాసాల్లో అధిక మొత్తంలో అదనపు కూలీ ఇస్తూ వచ్చారు. ఫిబ్రవరి నెల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఉపాధి హామీ కూలీలకు అందజేసే వేతనాన్ని ఫిబ్రవరి మాసంలో 20 శాతం అదనంగా, మార్చి మాసంలో 25 శాతం అదనంగా, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం అదనంగా చెల్లిస్తూ వస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెలలో ఇప్పటి వరకు ఉపాధి హామీలకు వేసవిలో చెల్లించే అదనపు కూలీ డబ్బులకు సంబంధించి ఆలోచించకపోవడం గమనార్హం. ఏటా ఫిబ్రవరి రెండో వారంలోగా అదనపు కూలీ ప్రకటన వస్తున్నప్పటికీ ఈ ఏడాది ఇప్పటికీ అదనపు కూలీ డబ్బుల ప్రకటన రాకపోవడంతో ఉపాధి హామీ కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం కూలీలకు అదనపు వేతనం రానట్టేనని అధికారుల ద్వారా తెలిసింది.

ఇప్పటి వరకు 52.36 లక్షల పనిదినాలు కల్పన..

ఈ ఆర్థిక సంవత్సరం 59.31 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 52.36 లక్షల పని దినాలను జిల్లా యంత్రాంగం కల్పించింది. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు రోజుకు రూ.272 కూలీ డబ్బులను అందజేస్తున్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకుగాను ఇప్పటి వరకు రూ.97.65 కోట్ల చెల్లింపులను పూర్తి చేశారు. మరోవైపు జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా హరితహారంతోపాటు ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి ఊట గుంతల నిర్మాణం, మట్టి రోడ్ల నిర్మాణం పనులను ప్రధానంగా చేస్తున్నారు. అసైన్డ్ భూముల్లోని రాళ్లను తీసివేయడం, భూమిని చదునుచేయడం, బౌండ్రీలు ఏర్పాటు చేయడం, ఎరువు గుంతల నిర్మాణం, బోరు బావి తవ్వించడం తదితర పనులు అసైన్డ్ భూముల్లో చేపట్టనున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, మట్టి కట్టలు, నీటి ఊట గుంతలు, పశువులకు షెడ్ల ఏర్పాటు, భూ ఉపరితల నీటి గుంతల నిర్మాణం, పంట కాలువల మరమ్మతులు, పంట మార్పిడి కల్లాలు, కొత్త సేద్యపు బావులు తవ్వడం, నిరవధిక సమతల కందకాలు, ఖండిత సమతల కందకాలు, కొండ దిగువ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు, పశువుల నిరోధక కందకాలు, భూసార సంరక్ష కందకాలు, కొత్త పంట కాలువల నిర్మాణం, మైనర్ ఇరిగేషన్ కాలువలో పూడికతీత తదితర పనులను చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1,83,309 జాబ్‌కార్డులు ఉండగా 3,77,087 మంది కూలీలు ఉన్నారు.

3127 కుటుంబాలకే వంద రోజుల పని..

ఏటా ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిని కల్పించడం పోయి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఈ ఆర్థిక సంవత్సరం వేల కుటుంబాలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఆర్థిక సంవత్సరంలో కనీసం 10 శాతం మేర కుటుంబాలకు కూడా పనిని కల్పించలేకపోయారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 30 రోజులే గడువున్నా ఇప్పటి వరకు కేవలం 3127 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనిని కల్పించారు. రెండేండ్ల క్రితం వరకు జిల్లాలో ఏటా 20 వేలకుపైగా కుటుంబాలకు వంద రోజులపాటు పనులను కల్పించగా, గత రెండేండ్లుగా వంద రోజుల పని పొందే కూలీల సంఖ్య మూడు వేలకూ పెరగకపోవడం గమనార్హం. జిల్లాలోని కొడంగల్, నవాబుపేట, పూడూరు, వికారాబాద్, దోమ, మర్పల్లి, పెద్దేముల్, మోమిన్‌పేట, బంట్వారం బొంరాస్‌పేట మండలాల్లో మాత్రమే 100 కుటుంబాలకుపైగా వంద రోజులపాటు పనిని కల్పించగా, మిగతా 8 మండలాల్లో సింగిల్, డబుల్ డిజిట్‌లోనే పని కల్పించారు. కోట్‌పల్లి మండలంలో అత్యల్పంగా కేవలం 30 కుటుంబాలకు మాత్రమే వంద రోజులపాటు పనిని కల్పించడం గమనార్హం. కులకచర్ల మండలంలో 58 కుటుంబాలు, యాలాల మండలంలో 64, తాండూరు మండలంలో 37, బషీరాబాద్ మండలంలో 81, దౌల్తాబాద్ మండలంలో 50, పరిగి మండలంలో 49, ధారూరు మండలంలో 96 కుటుంబాలకు వంద రోజుల పనిని కల్పించారు.

అతివలకు 'ఆరోగ్యమస్తు'

- గత యేడాది కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లాలో 20 ఆరోగ్య మహిళా కేంద్రాల ఏర్పాటు
- ప్రతి మంగళ వారం ఎనిమిది రకాల వ్యాధులకు ఉచిత పరీక్షలతో మందుల అందజేత
- ప్రాథమిక స్థాయిలోనే వ్యాధుల నిర్ధారణ
- జిల్లాలో ఇప్పటివరకు సేవలు పొందిన మహిళలు 38,133 మంది

రంగారెడ్డి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : పురుషులతో పోల్చుకుంటే మహిళలు అనారోగ్య సమస్యలను అధికంగా ఎదుర్కొంటూ ఉంటున్నారు. సమస్యను ఆదిలోనే గుర్తించకుంటే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం గత యేడాది ప్రారంభించిన ఆరోగ్య మహిళా సేవలు ఆదరణను చూరగొంటున్నాయి. జిల్లాలో దశల వారీగా 20 కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి మంగళవారం ఎనిమిది రకాల వ్యాధులకు సంబంధించి ఉచిత పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను అందజేస్తున్నారు. జిల్లాలో ఆరోగ్య మహిళా కేంద్రాలు ఆదరణను చూరగొంటుండగా.. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 38,133 మంది సేవలను పొందారు.

ప్రతి మంగళ వారం ప్రత్యేక సేవలు..

జీవనశైలిలో మార్పులు, అలవాట్లు, ఒత్తిడి, ఆందోళనలతో ఇటీవలి కాలంలో ఎక్కువ మంది మహిళలు హార్మోన్ల అసమతుల్యత(పీసీవోఎస్), థైరాయిడ్ సమస్యల బారిన పడుతున్నారు. రక్త హీనత, మెనోపాజ్ సమస్యలతోనూ బాధపడుతున్నారు. ఈ తరహా సమస్యలను ఆరంభంలోనే గుర్తించకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం మహిళలలు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఆదిలోనే వ్యాధులను నిర్ధారించి ఉచితంగా చికిత్స అందజేయడంతోపాటు మందులను అందజేస్తున్నారు. స్థానికంగా చికిత్స సదుపాయం లేనిపక్షంలో ఆపై ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు.

ఉచితంగా 8 రకాల పరీక్షలు..

ఎంపిక చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతి మంగళవారం మహిళా వైద్య, ఆరోగ్య సిబ్బంది పరీక్షలు అందుబాటులో ఉండి ఉచితంగా పరీక్షలు చేస్తున్నారు.

1. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు
2. ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ల స్క్రీనింగ్ పరీక్షలు
3. థైరాయిడ్, సూక్ష్మ పోషకాల లోపాలు, అయోడిన్ సమస్య, పోలిక్ యాసిడ్, ఐరన్ లోపం తదితర వాటిని గుర్తించే పరీక్షలు
4. మూత్రకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు
5. మెనోపాజ్ పరీక్షలతోపాటు హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ చేయడం, కౌన్సిలింగ్‌తో అవగాహన
6. నెలసరి, సంతాన సమస్యలపై ప్రత్యేక పరీక్షలు, అల్ట్రా సౌండ్ పరీక్షలు
7. లైంగిక సంబంధిత, అంటు వ్యాధులకు సంబంధించిన పరీక్షలు
8. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామం వంటి వాటిపై అవగాహన

మొదటి విడుత ఈవీఎంల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్‌లోని నాలుగు మండలాల్లో

ఎన్నికల ప్రవర్తన నియమావళి

వికారాబాద్, ఫిబ్రవరి 28 : జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గిడ్డంగి ఆవరణలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహబూబ్ నగర్ శాసనమండలి ఎన్నికను పురస్కరించుకొని జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాలకు ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. మహబూబ్‌నగర్ శాసనమండలి ఎన్నికకు సంబంధించి కొడంగల్ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రంలో 55 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి, షెడ్యూల్ పత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈవీఎంల మొదటి స్థాయి పరిశీలనపై ప్రతినిధులకు వివరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో ఎం.సుధీర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీకి మా భూములు ఇవ్వం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 28 : దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వానికి ఇచ్చేది లేదని లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాలకు చెందిన రైతులు స్పష్టం చేశారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం మూడు గ్రామాలకు చెందిన రైతుల భూములను తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని, కొందరు అధికారులు వచ్చి ఇటీవల రైతుల భూములను పరిశీలించారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీలు తమకు వద్దే వద్దని, ఏండ్ల నుంచి తాము భూములు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని రైతులు తెలిపారు. ఈ మేరకు బుధవారం మూడు గ్రామాలకు చెందిన రైతులు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి, దుద్యాల తహసీల్దార్ దానయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం హకీంపేట కూడలిలో రైతులు ధర్నా నిర్వహించారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు.


హకీంపేటలో ధర్నా చేస్తున్న రైతులు

కోడ్ కూసింది..

- మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మార్చి 4న నోటిఫికేషన్
- జిల్లాలో 171 మంది ఓటర్లు..షాద్ నగర్ ఎంపీపీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం
- సమీక్షలో కలెక్టర్ శశాంక



రంగారెడ్డి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని కలెక్టర్ శశాంక్ తెలిపారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 26న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్ కర్నూల్, వనపర్తి, వికారాబాద్ జిల్లాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోనూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. షెడ్యూల్ ప్రకారం మార్చి 4వ తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని, నామినేషన్లకు తుది గడువు మార్చి 11, మార్చి 12న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 14 తుది గడువు, మార్చి 28 ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు పోలింగ్, ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు, ఏప్రిల్ 4తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. జిల్లాలో పది మండలాలు ఆమనగల్లు, ఫరూఖ్ నగర్, కేశంపేట్, కొందుర్గు, కొత్తూరు, మాడ్గుల, తలకొండపల్లి, చౌదరి గూడెం, నందిగామ, కడ్తాల్ పరిధిలో 171 మంది ఓటర్లు ఉన్నారని, షాద్‌నగర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఉంటుందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర టీంల బాధ్యతలను కలెక్టర్ వివరించారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఎన్నికల కోడ్ వర్తిస్తుందని, కోడ్ ఉల్లంఘించకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. జిల్లాలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ టీములనూ ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.